క్లుప్తంగా

సిద్ధలింగేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే వైవీఆర్



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: కర్ణాటకలోని సిరుగుప్ప తాలూకా కె.సుగూరు గ్రామంలో సిద్ధలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిద్ధలింగేశ్వర మహాశివయోగి నూతన శిలామందిరం అర్చకులు, పీఠాధిపతులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనం అందించారు. ఎమ్మెల్యే వైవీఆర్ మిత్రుడు బళ్లారి భీమిరెడ్డి పాల్గొన్నారు.

వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన



ప్రజలతో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్ : పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటించారు. పట్టణంలోని కొత్త మార్కెట్టు, గానుగవీధి, పోలీస్ స్టేషన్ సర్కిల్, పాత మార్కెట్, బండమసీద్‌తోపాటు పలు వీధుల్లో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన డ్రైనేజీ, నీరు, విద్యుత్, వీధి దీపాలు వంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని వార్డు సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

పాదయాత్ర జయప్రదం చేయండి

యల్లనూరు: తుంగభద్ర నికర జలాల పరిరక్షణ కోసం జరుగుతున్న మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మంగళవారం రాయలసీమ యునైటెడ్ ఫోరం నేత పాతపేట కమలాకర్‌రెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమకు తాగు, సాగునీరు కావాలంటే కృష్ణానదిపై రోడ్ కం బ్యారేజీ నిర్మించాలన్నారు. అలాగే కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టును వెంటనే నిలిపేయాలన్నారు. అనంతరం పాదయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకులు సీమ కృష్ణ, నాగభూషణం, సంతోష్, సభ్యులు సర్వేశ్వరరెడ్డి, రఫీ, రామచంద్రారెడ్డి, బాబా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీల పార్టీ

గుంతకల్లు రూరల్: వైఎస్సార్‌సీపీ అంటేనే బీసీల పార్టీ అనేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనసాగిస్తున్నారని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్ కిరణ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ ఏ పార్టీ వడ్డెర కులాన్ని గుర్తించిన పాపాన పోలేదన్నారు. 2014లో చంద్రబాబు తిరుపతి సభలో వడ్డెర్లకు ఎమ్మెల్సీ కేటాయిస్తామని మాట తప్పారని, కానీ ఈరోజు సీఎం వైఎస్ జగన్ దాన్ని నిజం చేశారన్నారు. బీసీల అభివృద్ధి కోసం అహర్నిశలూ కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రాబోవు ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని కట్టబెట్టేందుకు బీసీలంతా ఎదురుచూస్తున్నారన్నారు.

యువకుడికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని జంబులదిన్నె కొట్టాల సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి.108 సిబ్బంది వివరాల మేరకు.. పాపినేపాళ్యంకు చెందిన అంజన్ కుమార్ బైక్‌పై అనంతపురం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. జంబులదిన్నె కొట్టాల సమీపంలోకి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అంజన్‌కుమార్‌ను 108లో అనంతపురము తరలించారు.

జూదరుల అరెస్ట్


యాడికి: మండల కేంద్రంలో మంగళవారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 8 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.1,10,500 స్వాధీనం చేసుకున్నామన్నారు.

తక్కువ ఖర్చుతో చిరుధాన్యాల సాగు : డీఏఓ

బుక్కరాయసముద్రం: తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం గడించే చిరుధాన్యాలను సాగు చేయవచ్చునని డీఏఓ చంద్రానాయక్ సూచించారు. గోవిందపల్లి, పొడరాళ్లలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ నీటి వనరులున్న రైతులు సైతం చిరుధాన్యాల సాగు చేపట్టవచ్చునన్నారు. ఈ ఏడాది పప్పుశనగా పంటను రూ.5,335తో కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ ముందుకొచ్చిందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఏడీ వెంకటరాముడు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు శంకర్‌లాల్, శ్రీనివాసులు, ప్రవీణ్, రుహానా బేగం, విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారి రవి ఉన్నారు.

ఉద్యానం.. అధ్వానం

- ఆహ్లాదం దూరం..నిధులు దుర్వినియోగం
- ఏ ఒక్కరికీ ఉపయోగపడని వైనం



ప్రభాత్‌నగర్‌లోని చిల్డ్రన్స్ పార్కులో శిథిలావస్థకు చేరిన పరికరం

గుంతకల్లు: రైల్వే ఉద్యోగులు, కార్మికులకు ఆహ్లాదం అందించడానికి, వారి పిల్లలు ఆడుకోవడానికి, పెద్దలు సేద దీరడానికి రైల్వే కాలనీల్లో ఏర్పాటు చేసిన పార్కులు అధ్వానంగా తయారయ్యాయి. ఈ పార్కుల కోసం రైల్వే యాజమాన్యం కోట్ల రూపాయాలు ఖర్చు చేసిన ఏ ఒక్కరికీ ఉపయోగపడటం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే కొన్ని పార్కులు కనుమరుగుకాగా వాటి స్థానంలో ముళ్లపొదలు పెరుగుతున్నాయి. పిల్లల కోసం ఏర్పాటు చేసిన క్రీడా పరికరాలు శిథిలావస్థలకు చేరాయి. వాటి స్థానంలో కొత్తవాటిని సమకూర్చకపోవడంతో పార్కులు నిరుపయోగంగా మారాయి. కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పార్కుల నిర్వహణను గాలి కొదిలేయడంతో పనికిరాకుండాపోయాయి.

మందుబాబులకు అడ్డా..

మోదీనాబాద్‌లోని రైల్వే హైస్కూల్ ఎదురుగా ఏర్పాటు చేసిన పార్కు ప్రస్తుతం మందుబాబులకు అడ్డాగా మారింది. ఇక్కడ ఏర్పాటు చేసిన పిల్లలు ఆడుకునే జారుడు బండ ధ్వంసమైంది. పెద్దలు పార్కులో సేదదీరడానికి చెట్ల మొదళ్లలో ఏర్పాటు చేసిన దిమ్మెలు శిథిలమయ్యాయి. ఇక వివేకానందనగర్ రైల్వేకాలనీలో ఏర్పాటు చేసిన పార్కులో క్రీడా పరికరాలు తుప్పపట్టి పాడైపోతున్నాయి. ఇక ఊయల కోసం స్తంభాలను ఏర్పాటు చేసినా ఊయలు ఏర్పాటు చేయలేదు. అదే విధంగా పిల్లలు ఆడుకునే పరికరం ఓ వైపు విరిగిపోవడంతో ఎందుకూ ఉపయోగపడటం లేదు. పార్కులు దిష్టిబొమ్మల్లా మారటంతో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కళావిహీనంగా ఉన్న ఆట వస్తువులు, బొమ్మల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి ఈ వేసవి సెలవుల్లో రైల్వే కార్మికుల కుటుంబాలకు ఆహ్లాదాన్ని అందించడానికి పార్కులను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

పార్కులను అభివృద్ధి చేయాలి



మా ఏరియాకు సమీపంలోని వీవీనగర్ పార్కు చాల అధ్వానంగా తయారైంది. సాయంత్రం పూట పిల్లలను ఆటలు ఆడుకునేందుకు పార్కులోకి వెళ్తే ఎలాంటి ఆట పరికరాలు లేవు. దీంతో కసాపురం రోడ్డులోని డాక్టర్ రాజశేఖరరెడ్డి పార్కుకు పిల్లలను తీసుకెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా రైల్వే పార్కులను అభివృద్ధి చేయాలి.

– డి.బాలరాజు, మారుతినగర్, గుంతకల్లు

సాఫీగా మండల సర్వసభ్య సమావేశం



సర్పంచులను సన్మానిస్తున్న దృశ్యం

పామిడి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. ఈసందర్భంగా సొరకాయలపేటలో ఓహెచ్‌ఆర్ ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి తాగునీటి ఎద్దడి తీర్చాలని సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి కోరారు. భూమి లేని అర్హులైన నిరుపేదలకు భూపంపిణీ చేపట్టాలి, హౌసింగ్ బిల్లుల జాప్యాన్ని నివారించాలని ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ పేర్కొన్నారు. పత్తి రైతులకు న్యాయం చేయాలని సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి కోరారు. ట్రాక్టర్లు, డ్రోన్ల సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ డీ లీనా వసుంధర తెలిపారు. బాల్యవివాహాలను అరికట్టి మాతా శిశు మరణాలను నివారణలో అందరూ భాగస్వాములు కావాలని ఎద్దులపల్లి పీహెచ్‌సీ డాక్టర్ అనిల్ కోరారు. పంటలకు బీమా వర్తించేలా చూడాలని జెడ్పీటీసీ ఎల్.శోభారాణి ఏఓకు సూచించారు. అనంతరం సర్పంచులు బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వారిని ఘనంగ సన్మానించారు. వైస్ ఎంపీపీలు నక్కా సౌభాగ్య, కాయల మహేష్, తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి, ఈఓఆర్డీ బీవీ శశికళ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, జోజోడే కుమార్, కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, నక్కా ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

పెద్దవడుగూరు : గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడానికి ప్రతి అధికారి కృషి చేయాలని వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిష్టిపాడులో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. అనంతరం ఆయా శాఖల ప్రగతిని చదివి వినిపించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి విద్యుత్ అధికారులను కోరారు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి



రవీంద్రారెడ్డిని గెలిపించాలని అభ్యర్థిస్తున్న సోదరుడు వెన్నపూస రమాకాంత్‌రెడ్డి

గుంతకల్లుటౌన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పార్టీశ్రేణులు పని చేయాలని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రామలింగప్ప కోరారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే వైవీఆర్ క్యాంప్ కార్యాలయంలో పట్టణంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. రామలింగప్పతో పాటు ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డి సోదరుడు వెన్నపూస రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు కలిగిన పట్టభద్రులందరినీ తప్పనిసరిగా కలిసి గడిచిన మూడున్నరేళ్లలో జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగవకాశాలు కల్పించిన విషయాన్ని వారికి తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్ప, పట్టణ సచివాలయాల పార్టీ కన్వీనర్ జింకల రామాంజినేయులు, కౌన్సిలర్లు చాముండేశ్వరి, మహాలక్ష్మి,కుమారి, చాంద్‌బాషా,రవీంద్ర, భాస్కర్, సుమోబాషా, సుధాకర్, ప్రభాకర్, కోఆప్షన్ సభ్యులు ఫ్లయింగ్ మాబు, నూర్‌నిజామి, వార్డు ఇన్‌చార్జ్‌లు మార్కెట్ వెంకటేష్, మస్తాన్, వీరేష్, గోపి, బ్రహ్మ, సంపత్, శివ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి తరపున వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శ్రీనివాసరెడ్డి, వెన్నపూస రమాకాంత్ రెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు పీరా, గోవర్ధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్‌యాదవ్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లయ్యయాదవ్, గుత్తి మండల సచివాలయ కన్వీనర్ సుభాష్‌రెడ్డి కోట జెడ్పీ ఉన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల, సచివాలయాల్లో ప్రచారం నిర్వహించారు. వెన్నపూస రవీంద్రా రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థింబచారు. కౌన్సిలర్లు నజీర్, వరదరాజులు, వాల్మీకి శివ, ఫరూక్, కేవీ రమణ, వార్డు ఇన్‌చార్జ్‌లు దస్తగిరి, హమాలి రామాంజి, పెద్ద మారెన్న, అబ్దుల్, సునీల్, మండల బీసీ సెల్ అధ్యక్షులు కొత్తపేట రాము, మైనార్టీ జిల్లా డైరెక్టర్ వైఎండీ ఫయాజ్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, సీనియర్ నాయకులు డిష్ అన్వర్, సుంకం రఫీ, తదితరులు పాల్గొన్నారు.

యాడికి: ఎమ్మెల్సీగా వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ వెన్నపూస చెన్నకేశవరెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో ప్రచారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ చెన్నప్ప, ఉప సర్పంచు కాసా చంద్ర మోహన్, సచివాలయాల మండల కన్వీనర్ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ భాషను కాపాడుకుందాం



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: అక్షరాన్ని బతికించి అమ్మభాషను కాపాడుకుందామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీ.గంగరాజు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సరోజినీ నాయుడు బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం అనురాధ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గంగరాజు మాట్లాడుతూ మన మాతృభాష ఒక్క అంశానికే పరిమితం కావడంతో తెలుగు అక్షరాలను మరచిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. ఇదిలాగే కొనసాగితే సంస్కృతం లాగా తెలుగు కనుమరుగు అయ్యే ప్రమాదం ఉందన్నారు. వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యాడికి: వేములపాడు వద్ద నున్న కేజీబీవీలో మంగళవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ప్రత్యేకాధికారి నిర్మల మాతృభాష ప్రాధాన్యతను విద్యార్థినులకు వివరించారు. విద్యార్థినులు వివిధ వేషదారణలతో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: విద్యార్థులు మాతృభాషను మరువరాదని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎల్‌ఐ, ఎస్సీ, ఎస్టీసెల్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ మేరి మాత, సీఎస్‌ఈ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ వీర ప్రకాష్, సుమన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అశ్వత్థం సర్వీసులతో రూ.12.28 లక్షల ఆదాయం

తాడిపత్రి టౌన్ : తాడిపత్రి నుంచి పెద్దపప్పూరు మండలం అశ్వత్థ నారాయణస్వామి తిరునాలకు ఏర్పాటు చేసిన 66 ప్రత్యేక సర్వీసుల ద్వారా ఆర్టీసీకి రూ.12.28 లక్షలు ఆదాయం చేకూరినట్లు డీఎం శంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 22న మొదటి ఆదివారం 8 ప్రత్యేక బస్సుల ద్వారా రూ 1,02,964, గత నెల 29న 15 ప్రత్యేక బస్సుల ద్వారా రూ 2,17,403, ఈనెల 5న 20 ప్రత్యేక బస్సుల ద్వారా రూ.4,04,018, ఈనెల 12న 15 ప్రత్యేక బస్సుల ద్వారా రూ.3,46,849, ఈనెల 19న 10 ప్రత్యేక బస్సుల ద్వారా రూ.1,57, 941 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక సర్వీసుల నిర్వహణకు సహకరించిన ఆర్టీసీ సీఐ నందిని , బస్టాండ్ మేనేజర్ పుల్లయ్య, సిబ్బందిని డీఎం అభినందించారు.

సజావుగా మండల సమావేశం

పుట్లూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా కొనసాగింది. ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల అధికారులు తమ శాఖలలో చేపడుతున్న ప్రభుత్వ కార్యక్రమాలను తెలియజేశారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం కొత్త తీర్మానాలు, ఆర్థిక పరమైన ఆమోదాలు చేయకుండా సమావేశాన్ని నిర్వహించినట్లు వివరించారు.

అశ్వత్థంలో హుండీ కానుకల లెక్కింపు

పెద్దపప్పూరు: అశ్వత్థంలో భక్తులు స్వామి వారికి సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ,.ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం రూ.10,87,135 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా అంకాలమ్మ, కుంటెమ్మ జాతర

పామిడి: కొండూరురోడ్డులో వెలసిన అంకాలమ్మ, కుంటెమ్మ దేవతామూర్తుల ఆలయంలో మంగళవారం అమ్మవార్ల జాతర ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా దేవతామూర్తుల ప్రతిమలను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను డప్పులమోతల నడుమ ప్రాకారోత్సవం గావించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

25లోపు ఈ–కేవైసీ చేయించుకోవాలి

పుట్లూరు: రబీలో పంటలు సాగు చేసిన రైతులు ఈ నెల 25లోగా ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏఓ కాత్యాయని తెలిపారు. మండలవ్యాప్తంగా 4,746 మంది రైతులు పంటలను నమోదు చేసుకోగా 3,941 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారని వివరించారు.

అరటి తోట ధ్వంసం

యాడికి: చందన గ్రామానికి చెందిన రైతు వలిపిరెడ్డి శ్రీనివాసులరెడ్డి సాగు చేసిన 3 ఎకరాల్లోని అరటి తోటను డోజర్ సాయంతో దాయాదులు ధ్వంసం చేశారు. బాధితుడు తెలిపిన మేరకు.. పంట ప్రస్తుతం కోత దశలో ఉంది. ఆస్తి పంపకాల విషయంగా శ్రీనివాసులరెడ్డికి ఆయన తమ్ముడి కుమారుడు రవికుమార్‌రెడ్డి మధ్య విభేదాలున్నాయి. ఈ క్రమంలో గత జనవరిలో అరటి పంటను రవికుమార్‌రెడ్డి ధ్వంసం చేయబోతుంటే శ్రీనివాసులరెడ్డి అడ్డుకున్నాడు. అప్పటి నుంచి మరింత కక్ష పెంచుకున్న రవికుమార్‌రెడ్డి మంగళవారం తెల్లవారుజామున డోజర్ సాయంతో మొత్తం పంటను నేలమట్టం చేశాడు. బాధితుడి నుంచి సమాచారం అందుకున్న ఎస్‌ఐ గురు ప్రసాదరెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. అనంతరం శ్రీనివాసులరెడ్డి, రవికుమార్‌రెడ్డిని తహసీల్దార్ అలెగ్జాండర్ ఎదుట బైండోవర్ చేశారు.

గృహసారథులే విజయ సారథులు

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎంపీ తలారి రంగయ్య



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి, ఎంపీ రంగయ్య, జెడ్పీ చైర్మన్ గిరిజమ్మ, ఆలూరు సాంబశివారెడ్డి తదితరులు

నార్పల: ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులే వైఎస్సార్‌సీపీ విజయానికి రథసారథులని స్థానిక ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని షాదిఖానాలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీతోపాటు ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నియోజకవర్గ పరిశీలకుడు రాజారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అందించని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. వీటిని చూసి ఓర్వలేక టీడీపీ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తోందన్నారు. ఇక చంద్రబాబు పాలనలో వానలుండవని, సభలు పెడితే ప్రజల ప్రాణాలుండవని, ఆయనపై కేసులు పెడితే విచారణలుండవని, చంద్రబాబు మాటలకు హద్దులుండవంటూ ఎద్దేవా చేశారు. టీడీపీ నాయకులు, పచ్చ మీడియా కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టి వచ్చే ఎన్నికల్లో జగనన్నను సీఎం చేసుకుందామన్నారు. ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ వలంటీర్లు అందిస్తున్న సేవలు అన్ని రాష్ట్రాలు చూస్తున్నాయన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు సంక్షేమ వారధులు వలంటీర్లేనన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ సీఎం జగనన్న అంటేనే ఓ నమ్మకమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్ని తూచ తప్పకుండా అమలు చేసిన ఘనత జగనన్నదని గుర్తు చేశారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ అనే స్టిక్కర్లను ఆవిష్కరించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు యాదవ్, సర్పంచు మస్నీల సుప్రియ, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు షాబీరా, ఎంపీటీసీ బాలనాగి నాయకులు భాగ్యలక్ష్మి, శంకర్‌యాదవ్,మిద్దె కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం



గుత్తిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

యాడికి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సామాజిక న్యాయం సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు తలారి నాగేష్, రషీద్ పేర్కొన్నారు. రాయలచెరువు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సోమవారం ప్రకటించిన 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 బీసీలు, 2 ఎస్సీలు, ఒకటి ఎస్టీలకు కేటాయించడం హర్షించదగ్గ పరిణామమన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా ముఖ్యమంత్రి వెంటే ఉన్నారని. ఇక ముందు కూడా ఉంటారన్నారు. 2024లో జరిగే సాధారణ ఎన్నికల్లో అన్ని సామాజిక వర్గాల అండదండలతో, 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉప సర్పంచు ప్రవీణ్ కుమార్ యాదవ్, వెంకటనారాయణరెడ్డి, రామకృష్ణ పరమహంస, హనుమంతరెడ్డి, రంగనాథ్, అన్వేష్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నాయీ బ్రాహ్మణులు మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు రంగస్వామి, సునీల్, రామస్వామి, నారాయణస్వామి, నారాయణ, రామాంజి, జానప్ప, మాణిక్యం, రామాంజనేయులు, సురేష్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. తదనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులను గతంలో పాలకులు కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నారన్నారు. కాని సీఎం జగన్ నాయీ బ్రాహ్మణుల సంక్షేమం కోసం అహర్నిశలూ కృషి చేస్తున్నారన్నారు. దేవదాయ శాఖలో ఆలయాల్లో ధర్మకర్తలుగా నియమించడంతోపాటు తమను కులం పేరుతో దూషించడకుండా జీఓలు జారీ చేశారన్నారు. నాయీ బ్రాహ్మణులు శ్రీనివాసులు, ఉపేంద్ర, రాజేష్, దస్తగిరి, సంజీవ, టైలర్ భాస్కర్, ఆర్‌ఎస్ రాజు,బాబు, నాగరాజు, నాగేంద్ర, రవి, శశి, రాజశేఖర్, హరి, లాలెప్ప, ధన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

25న గృహసారథులకు శిక్షణ

పామిడి: స్థానిక రహమత్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 25 ఉదయం 10 గంటలకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, పట్టణ, రూరల్ సచివాలయ మండల కన్వీనర్లు బీ ఆసిఫ్, ఎం కుమార్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హాజరవుతారన్నారు.

ఈ–కేవైసీ పూర్తి చేయండి

శింగనమల: రైతులు రబీ కింద పంటలను సాగు చేసిన రైతుల వివరాలను, పంట వివరాలను నమోదు చేసి, ఈకేవైసీ పూర్తి చేయాలని మండల వ్యవసాయాధికారి చిన్నమ్మ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. మండలంలోని తరిమెల, కల్లుమడి ఆర్బీకేలను మంగళవారం తనిఖీ చేశారు. ఆర్బీకేల్లో ఎరువుల అమ్మకాల రికార్డులు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఇంకా పెండింగ్ ఉన్న రైతులకు ఈ–కేవైసీ చేయించాలన్నారు. ఆర్బీకేల్లో పరిశీలించారు. అనంతరం తరిమెలలో భైరవ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి, ఎరువుల శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. వ్యవసాయ సిబ్బంది నవీన్, ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాల దగ్ధం

గుత్తి రూరల్: అనగానదొడ్డిలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వ్యవసాయ పరికరాలు దగ్ధమయ్యాయి. బాధితులు తెలిపిన వివరాలిలు.. గ్రామానికి చెందిన హరి, శీనా, రవిలు రబీ సీజన్‌లో పంటలు సాగు చేశారు. పంటలకు నీరు పెట్టేందుకు వ్యవసాయ బోర్లకు స్టార్టర్ బాక్సు, వాటర్ ఫిల్టర్లు, 20 పైపులను ఏర్పాటు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. పక్క పొలాల రైతులు గమనించి రైతులకు సమాచారం ఇచ్చారు. రైతులు వచ్చి మంటలు ఆర్పేలోపు వ్యవసాయ పరికరాలు బూడిదయ్యాయి. రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

వ్యవసాయంపై అవగాహన అవసరం

బుక్కరాయసముద్రం: విద్యార్థులకు చదువులతో పాటు వ్యవసాయపై అవగాహన అవసరమని మహానంది వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ శివ శంకర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం వడియంపేట గ్రామంలో ఆర్‌ఏడబ్ల్యూఈపీ మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నల కష్ట సుఖాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. రైతులకు ఆధునిక పరిజ్ఞానం అందించాలన్నారు. పంటల సాగులో ఖర్చులు తగ్గించే మార్గాలను వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామసుబ్బయ్య, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు రవి కిశోర్, వెంకటేష్ బాబు, శ్రీవిద్య, గీత, రమ్య. శ్రావణి, శాహీద, రైతులు వెంకటరెడ్డి, ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

నార్పల: జంగంరెడ్డిపల్లిలో ఆరు గడ్డివాములు దగ్ధమైన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామంలోని కుళ్లాయిరెడ్డి, చిన్న కుళ్లాయిరెడ్డి, చౌరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, బైపరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డికి గడ్డి వాములకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.6 లక్షల దాక నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి,రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి ఘటనా స్థలానికి బాధితులతో మాట్లాడారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కరూర్ వైశ్యాబ్యాంక్ ఎదురుగా ఉన్న కాంప్లెక్స్‌లోని జీకే టైలర్ షాపులో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో షాప్‌లోని కంప్యూటర్ డిజైన్ మిషన్‌తో పాటు 30 జతల దుస్తులు, మూడు కుట్టుమిషన్ల మోటార్లు కాలిపోయి రూ.1 లక్ష దాకా నష్టం వాటిల్లిందని టైలర్‌షాప్ యజమాని లింగన్న తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో సేఫ్ ఆసుపత్రి వద్ద మంగళవారం రాత్రి వైటీ చెరువు గ్రామానికి చెందిన పుల్లన్న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సేఫ్ ఆసుపత్రి వైద్యుల వైద్యం వికటించడం వల్లే పుల్లన్న మృతి చెందాడని మృతుని కుటుంబ సభ్యులు , బంధువులు ఆరోపించడంతో పాటు ఆసుపత్రి వద్ద కాసేపు ఆందోళన చేపట్టారు. ఎస్‌ఐ శ్రీనివాసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.